నష్టం కొండంత... పరిహారం గోరంత


వరద ఉధృతికి ముచ్చింతాల సమీపంలో దెబ్బతిన్న అరటి తోట


వెంకటాపురంలో నేటికీ వరద ముంపులోనే ఉన్న వరిపొలాన్ని చూసి దిగులుపడుతున్న మహిళా రైతు కుక్కమూడి అనసూర్య

- ఆశనిపాతంలా సీఎం చంద్రబాబు ప్రకటన
- ఎకరానికి రూ.10వేలు పరిహారంపై రైతన్నల పెదవి విరుపు
- పరిహారం పెంచాలని డిమాండ్

పెనుగంచిప్రోలు/కంచికచర్ల/జగ్గయ్యపేట/వత్సవాయి/వీరులపాడు: ఇటీవల సంభవించిన భారీవర్షాలు, వరదలకు జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేలాది ఎకరాల పంటపొలాలు దెబ్బతిన్నాయి. సాగుచేసిన పంట కొట్టుకుపోగా, పొలాల్లో ఇసుక మేట వేశాయి. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అరటి, పెసర, మినుము తదితర పంటలు 7023 హెక్టార్లలో దెబ్బతినగా, నందిగామ డివిజన్‌లో 15,988 హెక్టార్లలో పంటలు దెబ్బ తిన్నాయి. రైతులు వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.40నుంచి రూ.50వేల వరకు నష్టపోగా, వరి రైతులు ఎకరాకి రూ.20నుంచి రూ.25వేల వరకు నష్టపోయారు. ఇక కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ప్రభుత్వం పంటనష్టానికి పరిహారం అందించి ఆదుకుంటుందనే వేచిచూస్తున్న బాధిత రైతులకు సీఎం చంద్రబాబు ప్రకటన ఆశనిపాతంలా మారింది. వరదలకు నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ.10వేలు నష్టపరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై బాధిత రైతులు పెదవి విరుస్తున్నారు. సాగుఖర్చులు పెరిగిన నేపథ్యంలో ఈ పరిహారం ఏమూలాలకు సరిపోదని, తిరిగి పంటను సాగుచేయాలంటే మళ్లీ అప్పులచేయక తప్పేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీఎం చంద్రబాబు స్పందించి పంట నష్టపరిహారాన్ని ఎకరాకి రూ.20వేలు అందించాలని రైతులు కోరుతున్నారు. పంటనష్టం, పరిహారం ప్రకటనపై బాధిత రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..


కంచికచర్ల: మున్నలూరులో దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

ఎకరానికి రూ.20వేలకుపైగా ఖర్చు..


నాకు ఉన్న మూడెకరాల్లో రెండు ఎకరాల్లో వరి, ఎకరం పొలంలో మిర్చిసాగు చేశాను. మునేరు వరదకు మొత్తం పంట కోల్పోయాను. ఇప్పటికే వరి, మిర్చిపంటకు ఎకరానికి రూ.20నుంచి రూ.25వేల వరకు ఖర్చయింది. ఎకరానికి రూ.10వేలు ఇస్తే ఏమూలలకు సరిపోతుంది.

– మందా చంద్రశేఖర్, కె.పొన్నవరం, పెనుగంచిప్రోలు మండలం

ఇసుక మేట వేసింది..


ఎకరం పొలంలో మిర్చిసాగు చేశాను. మునేరు వరదకు పొలమంతా ఇసుక మేట వేసింది. ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు ఇస్తామంటోంది. ఇసుకమేట తీసేందుకు కూడా ఆ డబ్బులు సరిపోవు. ఇక పంటలసాగు ఎలా చేపట్టాలి.

– కటారపు వెంకట్రావమ్మ, వెంకటాపురం, పెనుగంచిప్రోలు మండలం

కౌలురైతులు కోలుకునేదెలా..


నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలి. ఎకరాకు రూ.20వేలు నుంచి రూ.30వేలు వరకు కౌలు చెల్లించి పంటల సాగు చేస్తున్నాం. ఎకరాకి పరిహారం రూ.10వేలు ఇస్తే మాలాంటి కౌలురైతులు కోలుకోలేరు.

– కనకపూడి పటేల్, కౌలురైతు, మంగొల్లు, వత్సవాయి మండలం

రైతుకు అండగా నిలవాలి..


నేను మూడెకరాల్లో వరిసాగు చేపట్టాను. వరదకు పంటలు దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడిలో ఒక్క రూపాయి కూడా చేతికి వచ్చేలా లేదు. ప్రభుత్వం పెద్దమనస్సుతో పరిహారం పెంచి రైతులకు అండగా నిలవాలి.

– చుంచు బెనర్జీ, రైతు, పెనుగంచిప్రోలు

ప్రభుత్వం ఆదుకోవాలి..


పంటనష్టాన్ని అధికారులు ఖచ్చితంగా లెక్కించి తమను ఆదుకోకపోతే గట్టెక్కలేము. అధికారులు ఇంకా నష్టాన్ని లెక్కిస్తున్నారు. ఈసమయంలో ఎకరానికి రూ.10 వేలు నష్ట పరిహారం ఇస్తామనే పిడుగు లాంటి వార్త రైతులను కలవరపెడుతోంది. ప్రభుత్వం ఆలోచించాలి.

– నలబోతు వెంకటేశ్వర్లు, దేచుపాలెం, వత్సవాయి మండలం

భారీగా పెట్టుబడి పెట్టాం....


ఇటీవల పాలేటికి వచ్చిన వరద కారణంగా తాము చేపట్టిన వరి, బంతి పూలసాగు పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రభుత్వం వరికి ఎకరాకు రూ.10వేలు మాత్రమే నష్టపరిహారం ఇస్తామని ప్రకటించడం బాధాకరం. పరిహారం పెంచి ఆదుకోవాలి.

– ఆవుల నాగరాజు, కె.అగ్రహారం, జగ్గయ్యపేట మండలం

పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి..


వరి, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం ఎకరాకి రూ.10వేలు ఇస్తామని ప్రకటించింది. ఈ పరిహారం పెట్టుబడి ఖర్చులకు ఏమాత్రం సరిపోదు. ఎకరాకి రూ.30వేలు పరిహారం ఇస్తే తప్ప తిరిగి సాగు చేపట్టలేని పరిస్థితి.

– కొరివి నాగరాజు, కె.అగ్రహారం, జగ్గయ్యపేట మండలం.

ఐదెకరాల్లో పంటనష్టం..


ఐదెకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేశా. ఇటీవల కుండపోతగా కురిసిన వర్షాలకు సాగుచేసిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. పంటనష్ట పరిహారాన్ని ఎకరాకి రూ.10వేలు మాత్రమే ఇస్తే సాగుఖర్చులు కూడా రావు. పరిహారాన్ని పెంచి రైతులను ఆదుకోవాలి.

– ముప్పాళ్ల అప్పారావు, కొత్తపేట, కంచికచర్ల మండలం

పత్తిసాగుకు రూ.50వేలు అయ్యింది..


ఎకరా పత్తిసాగుకు రూ.50వేలు ఖర్చు అయింది. భారీవర్షాలకు వరద చేలల్లోకి చేరి పంట దెబ్బతింది. పొలాల్లో ఇసుక మేట వేయడంతో పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి నష్టపరిహారాన్ని మరింత పెంచాలి.

– నకిరికంటి నాగేశ్వరరావు కౌలురైతు, కొత్తపేట, కంచికచర్ల మండలం

నష్ట పరిహారం పెంచాలి..


ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.10వేల నష్ట పరిహారం రైతుల నష్టాన్ని ఏమాత్రం పూడ్చలేదు. కురిసిన వర్షాలు, వరదల కారణంగా పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. రైతులకు తీరనినష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారాన్ని పెంచి ఆదుకోవాలి.

– ఇప్పల సత్యనారాయణరెడ్డి, జయంతి, వీరులపాడు మండలం

ఆదుకోకపోతే సాగు చేసేదెలా..


ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, వరి పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రభుత్వం అందిస్తామంటున్న ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఏమాత్రం సరిపోదు. ప్రభుత్వం స్పందించి పెట్టిన పెట్టుబడుల వరకైనా నష్టపరిహారంగా అందించాలి.

– వేమూరి యోహాన్, అల్లూరు, వీరులపాడు మండలం

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక


జగ్గయ్యపేట అర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక జీవీజే జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ ఎం. శ్రీనివాసరావు (ఎస్‌ఏపీడీ) అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి వ్యాయామోపాధ్యాయుల సమావేశంలో పేట ఎస్‌జీఎఫ్ కన్వీనర్‌గా ఎం.సావుడానాయక్(పేట బాలుర జెడ్పీ స్కూల్), నియోజకవర్గ కన్వీనర్‌గా గంటా వెంకటేశ్వర్లు(చిల్లకల్లు జెడ్పీ స్కూల్) నియమితులయ్యారు. త్వరలో జరగనున్న ఎస్‌జీఎఫ్ ఎంపికల తేదీలను ప్రకటించనున్నామని మండల సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ


జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లోని వరద బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆరు రకాల నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, వీఆర్వో హుస్సేన్, టీడీపీ నాయకులు కట్టా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలకు ఎంపిక

వీరులపాడు: ఈనెల 14వతేదీ నుంచి భీమిలిలో జరుగునున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పొన్నవరం ఏకత్వ పాఠశాల హెచ్‌ఎం అడపా నాగసూర్యవతి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులు ప్రతిపాటి వెంకట లోహిత్, కనకపూడి అభిషేక్, తాళ్ల లోహితాశ్వ, సురవరపు సుమంత్‌రెడ్డిలను గురువారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అమరనేని మనోజ్, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, గోగులమూడి మనోజ్, అమరనేని సింధూర, ఐశ్వర్య సాంబశివన్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టైలు పంపిణీ


అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈఓ డి.రవీంద్ర గురువారం టైలు పంపిణీ చేశారు. విద్యార్థులకు స్వచ్ఛందంగా టైలు అందజేసిన ఉపాధ్యాయులు శెట్టిపోగు రాము, ఫర్వీన్‌లను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర రాజీనామా

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేశారు. తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన రాజీనామా విషయాన్ని ఆయన ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ పోకడలు, విధి విధానాలు నచ్చక తాను పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య కూడా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డీసీపీ


నవాబుపేట(పెనుగంచిప్రోలు): గ్రామాల్లో శాంతియుత వాతావరణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని విజయవాడ రూరల్ డీసీపీ కె.ఎం.మహేశ్వరరాజు సూచించారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో గురువారం రాత్రి ఆయన పర్యటించారు. గ్రామంలో సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించారు. అనంతరం డీసీపీ మహేశ్వరరాజు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించమని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయకుడి నిమజ్జన కార్యక్రమాలు ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా నిర్వహించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ ఉన్నారు.

కన్నులపండువగా నవరాత్రి ఉత్సవాలు


నందిగామ కూరగాయల మార్కెట్‌లో కొలువుదీరిన గణనాథుడు


పేట కాకానినగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు


దాంగేనగర్‌లో కుంకుమపూజ చేస్తున్న మహిళలు


పెనుగంచిప్రోలులో గణనాథుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నందిగామ టౌన్: వినాయకచవితి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలను నందిగామ పట్టణంలో కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని ఆయా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముక్కోటి మహామండపం, కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు విశేషపూజలు చేశారు. మండలంలోని ఆయా గ్రామాలలోని గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం సెంటర్, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్:వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగ్గయ్యపేట పట్టణంలోని ఆయా మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాకానినగర్, దాంగేనగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద మహిళలు కుంకుమపూజలు చేశారు. అర్చకులు బి.రాఘవ శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

కంచికచర్ల: వినాయక చవితి సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గండేపల్లి, కీసర, కంచికచర్లల్లోని పలు గణనాథుల విగ్రహాలను కీసర మున్నేరులో నిమజ్జనం చేశారు. మునేరు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన భద్రతా చర్యలు చేపట్టారు. విగ్రహాల నిమజ్జనం ప్రాంతాలను ఎస్‌ఐ బోనగిరి రాజు పర్యవేక్షించారు.

వత్సవాయి మండలంలో...

మక్కపేట(వత్సవాయి): మండలంలోని ఆయా వినాయకుడి మండపాలను భక్తులు గురువారం సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. మక్కపేటలో గణనాథుని విగ్రహాల ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. గ్రామంలో చవితి పందిళ్లు, ఆలయాల వద్ద ఏర్పాటు చేసిన 12 వినాయకుడి విగ్రహాలను డీజే సౌండ్స్, తీన్‌మార్ మోతల మధ్య ఊరేగించి వేదాద్రి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పెనుగంచిప్రోలు కాకానిబజార్‌లో..


వత్సవాయి మండలం మక్కపేటలో సాగుతున్న వినాయక విగ్రహాల ఊరేగింపు


కీసర మున్నేరులో పోలీసు బందోబస్తు నడుమ వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు

వరద ముంపు ప్రభుత్వ వైఫల్యమే


మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: భారీవర్షాలు, వరదలతో ముంపునకు గురై అవస్థలు పడుతున్న బాధితులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కనీస సహాయకచర్యలు కూడా అందించలేకపోయిందని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వరదల పరిస్థితిపై గురువారం ఆయన స్పందించారు. వరద ముంపు సమాచారాన్ని విజయవాడ ప్రజలకు తెలిపి అప్రమత్తం చేయలేని దుస్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉండటం దురదృష్టకరమన్నారు. వరద బాధితులకు స్వచ్ఛందసంస్థలు అందించినంత మాత్రంగా కూడా ప్రభుత్వం సహాయక చర్యలను అందించలేకపోయిందన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, ఆహారం అందించడం వంటి కనీస వసతులు కల్పించటంలో కూడా ఘోరంగా సీఎం చంద్రబాబు విఫలమయ్యారన్నారు. బాధితులను ఆదుకోవడంలో విఫలంకావడంతోపాటు తన ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తప్పిదాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

నియోజకవర్గంలోనూ అదేతంతు..

ముఖ్యమంత్రి చంద్రబాబు తనతప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షపార్టీలపై బురదజల్లుతున్నట్లుగా, నియోజకవర్గంలోనూ అధికారపార్టీ నేతలు అదేబాటలో నడుస్తున్నారని జగన్‌మోహనరావు ఎద్దేవా చేశారు. కంచికచర్ల ఓసీ క్లబ్‌లోని పునరావాస కేంద్రంలోని సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు వెళ్లిన తనపైనే అనుచితంగా వ్యవహరించారని గుర్తుచేశారు. ఓసీ క్లబ్ అందించిన సహాయక చర్యలను ప్రభుత్వం చేసినట్లుగా చెప్పుకుని ప్రజల మెప్పు పొందేందుకు విఫలయత్నం చేశారని ఎద్దేవా చేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం సకాలంలో స్పందించలేదన్నారు. గతంలో వరదలు వచ్చిన సమయంలో తాము అధికారులను సమన్వయం చేసి ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు, పిల్లలకు పాలు అందించిన విషయాన్ని ప్రజలే గుర్తుచేస్తున్నారన్నారు. వరదల కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతిరైతును ఆదుకోవాలన్నారు. పరిహారం విషయంలో తప్పుడు హామీలు ఇస్తూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సీఎం చంద్రబాబు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం వరద బాధితులకు పరిహారం అందించి వారు కోలుకునేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి : అన్నెపాగ


విలేకరులతో మాట్లాడుతున్న అన్నెపాగ శ్రీకాంత్, రాంబాబు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి అన్నెపాగ ప్రపుల్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. జగ్గయ్యపేటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీకి ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. గతంలో కంటే సభ్యత్వ నమోదు పెరుగనుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోర్ కమిటీ సభ్యుడు కీసర రాంబాబు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు వేదా సుబ్రహ్మణ్యం, ఓబీసీ జిల్లా మోర్చా ప్రధానకార్యదర్శి కల్లూరి శ్రీవాణి, నాయకులు బొడ్డు మల్లికార్జున్, డి.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుకు విశేష స్పందన : బీజేపీ

నందిగామ టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన బీజేపీ సభ్యత్వ నమోదుకు దేశవ్యాప్తంగా విశేష స్పందన వచ్చిందని ఆపార్టీ నందిగామ నియోజకవర్గ ఇన్‌చార్జి పోరుగంటి నరసింహారావు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశం ప్రగతిపథంలో సాగాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. బీజేపీ సభ్యతాన్ని తీసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు సీతారామయ్య, శ్రీనివాసరావు, సాంబశివరావు, రమేష్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా అల్ట్రాటెక్


ట్యాంక్ ద్వారా బూదవాడ గ్రామస్తులకు మంచినీటిని అందిస్తున్న అల్ట్రాటెక్ సిబ్బంది

బూదవాడ(జగ్గయ్యపేట): ఇటీవల పాలేటికి వచ్చిన వరద ఉధృతికి ఎస్సీ, ఎస్టీకాలనీలతోపాటు బూదవాడ గ్రామంలో సగానికి పైగా వరద నీరు పోటెత్తింది. దీంతో వందలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. గ్రామంలోని అల్ట్రాటెక్ కర్మాగారం యాజమాన్యం వారికి బాసటగా నిలిచి వారంరోజుల పాటు కర్మాగారంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. బాధితులకు సకల సదుపాయాలు అందించారు. ముఖ్యంగా గ్రామం నుంచి జగ్గయ్యపేట వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకుపోవటంతో ఐదు రోజుల పాటు కర్మాగారం ఇంజనీర్లు శ్రమించి రాకపోకలను పునరుద్ధరించారు. ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకు తాగునీటిని అందించడంతోపాటు ఫైర్ ఇంజిన్లతో బురదను శుభ్రం చేశారు. గ్రామాభివృద్ధికి ఫ్యాక్టరీ యాజమాన్యం కృషి చేస్తోందని ప్లాంట్ హెడ్ సతీష్ తెలుపగా, కర్మాగార యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

100 మందికి వైద్యపరీక్షలు

బూదవాడ సచివాలయంలో గురువారం అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాగారం వైద్యులు కిరణ్‌బాబు, సతీష్ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కర్మాగారం ప్రతినిధులు నారాయణ, సతీష్, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, ఆర్డీవో రవీంద్రరావు

నందిగామ టౌన్: వరద బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వద్ద వరద బాధితులకు పౌరసరఫరాలశాఖ అందించిన నిత్యావసర సరుకులను ఆర్డీవో రవీంద్రరావుతో కలిసి గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ వరద ముంపునకు గురైన 1923 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బాధితులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని అధైర్యపడొద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రమణబాబు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని అంబారుపేట, ఐతవరం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులు ఉన్నారు.